ఎవరో సినిమాతార వాఙ్మూలం చదువుతూ చదువుతూ "వీళ్ళకిదేపని కాబోలు" అన్నాడు.

"ఏమిటి?" తాతయ్య ప్రశ్నించాడు.

వాఙ్మూలం పైకిచదివి వినిపించాడు.

రిప్రజెంటేటివు యిటుదిరిగి అన్నాడు - "అదంతా అబద్ధం - పాపం వాళ్ళమీద అన్యాయంగా నిందలువేశారు."

"వీళ్ళకిదే వుద్యోగం. అయినా యిప్పటి సినిమాలు ఒట్టిచెత్త. పసందుగా పుణ్యపురుషులు జీవితాలుగాని, మహామంత్రులు జీవితాలుగాని, లేక ఒక గొప్ప వ్యక్తి జీవితంగాని చిత్రీకరిస్తే యెంత బాగుంటుంది. చూడండి, మల్లీశ్వరి చిత్రంలో శిల్పం యెంత బాగా చూపించాడో. శ్రీ కృష్ణ దేవరాయలి కాలంనాటి సంగతులు తెల్సుకో గలుగుతున్నాం. ఇంకా ఆయన ఆస్థానంలో వున్న తిమ్మరుసు - మహామంత్రి - అతని జీవితం చిత్రంగా తియ్యగూడదూ? కాళిదాసాది మహాకవులున్నారు. ఒకటేమిటి చరిత్ర తిరగవేస్తే యెన్నో యితివృత్తాలు దొరుకుతాయి. మన వాళ్ళకి చరిత్రఅక్కర్లేదు. సంస్కృతి అక్కర్లేదు. మన సాంప్రదాయాలు అక్కర్లేదు. ఎంత సేపూ విదేశీ నృత్యాలు, అర్థ నగ్నదృశ్యాలూ ఛీఛీ-అసహ్యించుకున్నాడు తాతయ్య.

తాతయ్యని అందరూ మెచ్చుకున్నారు. అన్ని విషయాలూ బాగా తెల్సు. అన్నిట్లోనూ పండిపోయాడాయన. అందుకే ఆయన్ని "తాతయ్య" అనడంలో తప్పులేదు. బస్సు రైలు స్టేషనుదగ్గర ఆగింది.

---

క థా ని క

# చీలిన ప్రేమ

"గోపి"

"బెడ్డింగు కట్టడం ఇంకా కాలేదా?" అని కొంచం విసురుగానే అడిగాడు ఆఫీసు గదిలోంచి శ్రీకాంత్.

"అన్నీ సిద్ధంగానే ఉన్నాయి. కొంచం మజ్జిగా అన్నం తినివెళ్ళరూ?" అని భయవినయ సమ్మిళితమైన లలిత గొంతుక సమాధానం ఇచ్చింది

"ఇల్లారా" అన్నాడు శ్రీకాంత్.

చేతినిండా శనగపిండి, రేగిన జుట్టుతో, సగం జారిన పయటను పిండి అంటకుండా, చేత్తో సరి జేసుకుంటూ లలిత వచ్చి నిలబడింది.

"ఇదంతా ఏమిటి?" అన్నాడు ఆమె చక్కని రూపాన్ని జాలిగా చూచి నిట్టూర్చి.

"ఏంలేదు నాలుగు బజ్జీలు వేస్తే మధ్యాహ్నం ఫలహారానికి పనికొస్తాయని" అని మెల్లిగా నమిలింది, కొసమాటని భయంతో,

"ఇక్కడున్న నర్సీపట్టణానికేనా ఇన్ని ఫలహారాలూను?" అన్నాడు వేళాకోళంగా.

"నర్సీ పట్టణమా మీరు వెళ్ళేది" అని ఆత్రంగా అడిగింది. ఔనని తలూపాడు శ్రీకాంత్.

"ఆమె అక్కడే ఉందండీ ఓసారి చూసొస్తారా?" అన్న ప్రశ్నకి, "ఎవరా స్వరనామధేయురాలు" అని చీదరించుకున్నాడు.

"ఆమేనండీ!"

ఆడువారి చేతిలో సర్వనామాలు పొందే స్వతంత్రాన్నాలోచించి నవ్వుకుంటూండగానే జ్ఞాపకం వచ్చింది.

"బదిలీ ఐపోయిందన్నావ్?" అన్నాడు తరంగాల్లా వచ్చే ఆలోచనల్లోంచి.

"మళ్ళీ వచ్చేశారుటండీ, మొన్ననే తెలిసింది ఒకరిద్వారా. దగ్గర్లో ఉన్నాం కనుక ఒకసారి రమ్మన్నదిట కూడాను..." జట్కా రావటం, మెతుకులు తినివచ్చి కోర్టు కాగితాలు చేత్తో పుచ్చుకు తోలమన్నాడు బస్ స్టేండుకి.

బస్ లో కూర్చున్నదగ్గరనుంచీ ఏది ఆలోచిద్దామన్నా "రజని" జ్ఞాపకం రావడం మొదలుపెట్టింది. మదరాసు వదలి విశాఖపట్టణం రావడం,

హైకోర్టు వదిలి చిన్నకోర్టుల్లో ప్రాక్టీసుచేయడం దీనంతటికీ తల్లితో ఏవేవో కారణాలు చెప్పి తప్పించుకు తిరగడం, ఏదీ అంత బాధించటం లేదు. కాని ... ఆలోచించడం, శ్రీకాంత్‌ని మూడేళ్లు వెనిక్కి లాక్కెళ్లింది మనస్సు.

*　　　*　　　*

శ్రీకాంత్ మదరాసులో 'లా' చదువుతూన్న రోజులు. అక్కగారు నర్సీపట్టణంలో ఉండటం, శెలవలకి శ్రీకాంత్ రావటం, 'శివరాత్రి' యాత్రకి 'బలిఘట్టం' వెళ్లడం జరిగింది. మూడుగంటలవరకూ పిడుగులావచ్చింది ఎండ. కొండ ఎక్కడం ప్రారంభించాడు, కారుమబ్బులు కమ్మి చినుకులు ప్రారంభించాయి. గొడుగులేదు. దగ్గరతోవలా కనబడ్డ రస్తానుపట్టి, త్వరత్వరగా మీదికి పోనారంభించాడు. పొదలచాటున అలజడి విని "ఎవరు వారు?"అన్నాడు.

"నేనండీ! దారితప్పిపోయాను," అని జవాబిస్తూ, 'భీతహరిణేక్షణ,' శ్రీకాంత్ వైపొచ్చిందో అమ్మాయి. నిండు యౌవ్వనంలో వున్న చక్కని అమ్మాయి, శ్రీకాంత్‌ని చలింపజేసింది. కాని వెంటనే "నేనంటే" అన్నాడు వెంకితనంగా పట్టణపు చలాకీతో.

"తాసిల్దారు గారింట్లో ఉన్నానండీ."

"పేరు?"

"లలితండీ, మీదికిపోయేదెట్లా?" అని అడిగింది నలుదిక్కులూ కంగారుగా చూస్తూ.

"నాతో రా" అన్నాడు శ్రీకాంత్, ఆమె తడిసినందుకు జాలీచూపడంలో, తెరవెనుక సౌందర్యపు ఛాయల్ని తృప్తిగాచూస్తూ. లలిత నాలు గడుగులువేసి రాయిజారి, కూలబడింది. చిన్నపిల్లను లేవనెత్తినట్లెత్తి, దులిపి, చనువుగా నడుంచుట్టి పట్టుకున్నాడు. చినుకులు పడుతూనే ఉన్నాయి.

"ఒద్దండీ!" అని భయంగా తొలగబోయింది లలిత.

"మళ్ళా పడిపోతావ్" అని అపహాస్యంగా బెదిరించాడు, మెరిసే ఆమె కళ్ళలోకి చూస్తూ.

"మీరెవరండీ"అని అడిగింది, మొదటిసారిగా పట్టణపు నాజూకును గమనించి. "నా పేరు శ్రీకాంత్, మదరాసులో లా చదువుతున్నాను. మా అక్కగారింటికి వచ్చాను శెలవలకి. తాసిల్దారుగారేమౌతారు?" అని అడిగాడు మళ్ళా.

"ఏమీకారండీ ఆమెదీ నాదీ ఒకేవూరు. నాకెవరూ లేరిప్పుడు. అందుకని ఆమెతోనే ఉంటున్నా" తలాతోకా తెలియని సంబంధం చెప్పడం పూర్తికాకుండానే, "లల్లీ"అన్న పిలుపు వినబడింది. అదరిపడి, ప్రక్కగా నిలపడింది. దూరంనుంచే చూచాయగా చూచింది రజిని.

"ఎక్కడ తప్పిపోయావ్?"అని గద్దించింది.

"నమస్కారమండీ! మీ లలిత దారితప్పి తిరుగుతూ కనబడగా దారి చూపిస్తున్నానండీ" అన్నాడు నవ్వుముఖంతో శ్రీకాంత్, పరిచయం లేకపోయినా చనువుగా పలకరించే ఆగంతుకుని చురచుర చూచింది రజిని. కాని ఆయనలోని ఏముందో ఆకర్షణ, చల్లపడిపోయింది వెంటనే. మబ్బులు విడిపోయాయి. తడిబట్టలు చల్లగా ఉన్నా, సంబరంలో పడ్డాక ఏమంత బాధనిపించలేదు. అస్తమించే సూర్యుడు, తన బంగారు కిరణాలతో కొండని ముంచెత్తుతున్నాడు... లలిత రంజలరాట్నం ఎక్కింది. ఆమెకది సరదా. రజిని, శ్రీకాంతులు ఆమెకోసం ఆగేరు. తనకింక వాళ్ళతో పనిలేదని తెలిసినా వదలి వెళ్ళలేక పోయాడు శ్రీకాంత్. సమూహంలో దగ్గరదగ్గరగా నిలబడే రజని శ్రీకాంత్‌ని తనివితీరా చూస్తూ ఉండిపోయింది. శ్రీకాంత్‌కి రంజల రాట్నంమీద తిరుగుతూన్న లలితమీదే దృష్టి.

రాత్రి శ్రీకాంత్ మదరాసులో చూచిన ఎగ్జిబిషన్లు అందులో తన అనుభవాలు తలుచుకు, "నూరు ఎగ్జిబిషన్లుకూడా ఒక శివరాత్రి పాటి చెయ్యవ"నుకున్నాడు. పట్టణపు పొడరు పూతలు సామాజిక సౌశీల్యాలు తెలియని లలితని తలుచుకొని తియ్యని కలలుకన్నాడు.

*　　　*　　　*

శెలవల తరువాత పట్టణంచేరాక "కొత్త పెళ్ళికొడుకులా వున్నావని" స్నేహితులు పొగిడేరు. "ఒక్కనెల్లో గొప్పగా మారేవ్" అన్నారు. బలిఘట్టపు సంఘటనానంతరం అనుకోకుండానే లలితని చాలాసార్లు కలుసుకున్నాడు. పట్టణాలలో నలుగురిలో మసిలే శ్రీకాంత్ "లలితని అన్యాయం చేస్తున్నానని" అనుకోలేదు. లలిత సుందరి. అకస్మాత్తుగా స్నేహం అలవడింది. శ్రీకాంత్ చక్కని

మాటకారి. సుళువుగా ఆమె హృదయాం చూరగొన్నాడు. అనుకున్నకంటే పరిచయం ఒకడుగు ముందుకే వెళ్ళింది. శెలవల్లో అనుభవాలు నెమరుకువచ్చి కలతపెట్టాయి. "లక్షాధికారి ఏకైక పుత్రుడు, పెద్ద ఆశలుపెట్టుకు ఒక సామాన్యమైన పల్లెటూరి పిల్లని పెండ్లాడి, తల్లిని అక్కని ఎదిరించి, సంఘంలో చులకనై ఉండటం" తలుచుకుంటే గుండె దడపెట్టింది. 'తన ఒంటరితనమే దీనికి కారణం, లేకుంటే అలాంటిపని చేసుండే వాణ్ణికాను' అనుకున్నాడు. "ఐనా ఇదంతా శెలవల్లో పితలాటకంతే" అని సముదాయించుకున్నాడు చులాగ్గానే.

నెల గడిచింది. ముత్యాలకోవలాఉండే అక్షరాలతో ఒక ఉత్తరం వచ్చింది..."మదరాసు చేరాక మీ దాసిని మరిచారు. చదువుల ఒత్తిడిని అలిసి, దీపంకూడా ఆర్పకుండా ప్రియురాల్లా మీదకొరిగే పుస్తకాన్ని తొలగించకుండా నిద్రపోయే మీకు సేవచేసే భాగ్యంలేదు కదా అని విచారం......"

"మీ దాసి లలిత"

అని ఉన్న చక్కని ఉత్తరానికి జవాబివ్వకుండా ఉండలేక పోయాడు... రెండు నెలల్లో చాలా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. శ్రీకాంత్‌లో నిదురపోతూన్న శక్తులు మేలుకొన్నాయి. దూరదేశాలనుంచివచ్చే మేఘాలు అనుకూల వాతావరణానికి సంతోషంతో వర్షించినట్లు, లలిత ప్రతీ ఉత్తరం కొత్త వెలుగులు చిలుకుతూ ఆత్మవిజ్ఞానాన్ని కలిగించాయి.

ఒకనాడొక పెద్ద కవరు వచ్చింది. దాంట్లో, "మన కలయిక నిష్ఫలంకాలేదు. మెత్తని మీ చేతుల్లో సున్నితంగా నలిగిన మీలలితని సాంఘిక సూక్తుల రంపపుపళ్ళ కెర జేస్తారా? .." ఇంకా ఉంది, మరి చదవలేకపోయాడు. శ్రీకాంత్‌లోని మానవత్వం చేసిన పనిని గర్హించింది. కాని పరీక్షరోజులు, 'ఇదమిత్థ'మని తేల్చుకోలేని ఆశయాలు, ఉత్తరం వ్రాసినా పోస్టు చేరనివ్వలేదు. ధనం ఇచ్చే నిషా కలవాటుపడ్డ శ్రీకాంత్ ఆదర్శాల ఒత్తిడికి వెంటనే లొంగలేకపోయాడు. లలితని పెళ్లాడ్డం తల్లి ఒప్పుకోదు. ఆస్తి ఆమెది. ఇలాంటివి ఎప్పుడూ భయపెడుతూండేవి.

ఆఖరుపరీక్ష పూర్తయింది. లలితనుంచి మరో ఉత్తరం వచ్చింది. "మరిచిపోండి శ్రీకాంత్. నా పాపఫలానికి మీరెంతమాత్రం కారణం కాదు. స్నేహంగా చేరదిసి అనాధకు ఆధారం చూపిన రజనమ్మగారికి, ఉత్తమ కులజులగు మీకు అవమానం తెచ్చేకంటే ఈ గుక్కెడు ప్రాణాలూ- మీ సున్నితహృదయాన్ని గాయపర్చాను క్షమించరూ!

ఎల్లప్పుడూ మిమ్మల్నే ప్రేమించే లలిత."

అన్న ఉత్తరం శ్రీకాంత్‌లోని పౌరుషాన్ని రెచ్చకొట్టింది. వెంటనే ఆరాత్రే బయలుదేరివచ్చి రహస్యంగా లలితని పెండ్లి చేసుకుని, కొద్దిరోజుల్లో తీసుకుపోతానని చెప్పి వెళ్ళిపోయాడు. ఈ సంగతి రజనికికూడా లలిత తరువాతచెప్పింది. ఉత్తరప్రత్యుత్తరాలు మట్టుకు యథావిధిగానే జరుగుతున్నాయి. ఉద్రేకాన్ని, అభిప్రాయాల్లో స్వేచ్ఛగా చూపించుకునేవారు. కాలం దొర్లిపోతూంది. శ్రీకాంత్ తల్లిముందు లలితగురించి సంభాషణ చేయడానికి ఎన్నోసార్లు ప్రయత్నించాడు. కాని తల్లి రోకటిపాటలా 'లా'పూర్తికాగానే, ఏ సంబంధంచేస్తే ఎంతకట్నంవస్తుందో, ఏవిలాభాలు ఉన్నాయో పూసగుచ్చినట్లు చెప్పడం ప్రారంభించింది... తల్లిముందు లలితని గురించి చెప్పడం కష్టమైంది. తాసిల్దారుగారిక్కి ట్రాన్స్ఫర్ అయినట్లు, వెంటనే రమ్మని లలిత ఉత్తరం, తల్లి కాశీయాత్ర ప్రయాణం ఒకేసారి తగిలాయి. ధైర్యముగా లలితని విశాఖపట్టణం తెచ్చి పురుడు పోయించాడు. తల్లికి ఏవో సాకులు చెబుతూనే వున్నాడు విశాఖపట్టణం కాపురానికి.

* * *

నెలగడచింది. పట్టణంలో ఇల్లు, నౌకరు, నూతన శిశువు, శ్రీకాంత్‌కి భయమునూ, ఆనందమూనూ కూడా కలుగజేసింది.

ఒకనాడు లలితని శ్రీకాంత్ యాత్రలోఉన్న తల్లికి ఉత్తరం వ్రాయమన్నాడు. కోడలిఉత్తరం తల్లిని తప్పక సుప్రసన్నను చేస్తుందని నమ్మకం. ఏదోకథ చెప్పొచ్చునని ఊహ. ఉత్తరం వ్రాయడానికి పోయిన లలిత చాలా సేపటివరకూరాలేదు. "కాలేజీచదువు లేకపోయినా, సహనం, సంస్కృతి కల లలిత, పట్టాలుపొందిన పట్టణపు అమ్మాయి

లకే ఏమీ తీసిపోదు. తల్లితప్పకుండా క్షమిస్తుంది' అన్న ఆలోచనలోనుంచి అదరిపడిలేచి లలిత ఉన్న గదిలోనికి వెళ్ళాడు. కన్నీటిధారికలు, ఎర్రబడ్డకళ్ళు లలితముందు పిచ్చిగీతల కాగితం చూచి తెల్లపోయాడు. "క్షమించరూ" అంటూ పాదాలకి కన్నీటి అభిషేకం చేస్తూంది. "నీకు చదువురాదా?" అని మాత్రం అనగల్గాడు.

"ఆమే వ్రాసేవండీ మీకు అన్ని ఉత్తరాలూ" అని ఏడుపుమధ్య చెప్పింది. శ్రీకాంత్ ఊహా సౌధం కూలింది. లలితమీద తీరని అసహ్యం ఏర్పడింది. 'పాపం ఆమెదికాదుతప్పు' అని ఎన్నో సార్లనుకున్నాడు... కానీ

శ్రీకాంత్ సంఘసంస్కర్తకాడు. డబ్బు, చదువు ఉన్నాయి. డబ్బుండేవాళ్ళకుండే ఆదర్శాలే అతనికీ ఉన్నాయి. ఊహాసౌధంలో, ఉన్నతస్థానంలో, ప్రతిష్ఠించిన లలితతో ప్రపంచాన్ని ఎదుర్కొందామనుకున్నాడు. కాని ఈ లలితతో పట్టణంలో తనకొక్కక్షణంకూడా స్థానంలేదని తేలిపోయింది. విశాఖపట్టణం కాపురం స్థిరం చేసుకున్నాడు...

ఇప్పుడు నర్సీపట్టణం వెళుతున్నాడు. "రజని అక్కడే ఉంది." ఇదే ఆలోచన పదే పదే రావడం మొదలుపెట్టి ది. నర్సీపట్టణం చేరాడు. కేసు వాయిదా పడింది. తహసీల్దారిగారి ఇల్లు కష్టపడకుండానే కనుక్కున్నాడు. ఆయన కేంపు వెళ్ళాడు. కాని దూరంనుంచే పోల్చి, "రండి శ్రీకాంత్ చాలాకాలానికి" అని ఆహ్వానించింది. కాఫీ ఫలహారాలుపెట్టి ఏవేవో ప్రశ్నలువేసింది. జవాబుచెప్పి వెళ్ళొస్తానండీ అన్నాడు.

"అబ్బే! మీరలా తప్పించుకుందికి వీలులేదు. కనీసం భోజనంచేసి వెళ్ళాలి" అని బలవంతం చేసింది. ఎందుకో ఎదిరించలేకపోయాడు.

"భోజనాలైయ్యాయి. ఇహ వెళతానండీ" అన్నాడు. తనలో ఏదో ఉద్రేకం పుట్టుకొస్తూన్న సంగతిగ్రహించి దార్వాన్‌ని కారు ఇంటికి తెమ్మని పంపింది. తాంబూలం వేసుకుంటూ, "మీకు తీరని అన్యాయం చేశాను కదండీ శ్రీకాంత్" అంది బరువుగా ఊపిరి తీస్తూ రజని.

"అసలు ఎందుకుచేశారో నా కర్థంకాలేదు" అన్నాడు కష్టంమీద.

"మొదట్లో మట్టుకు అమాయకురాలైన లలిత కోసం..."

"తరువాత...?"

"తరువాత మీకుత్తరాలు వ్రాయకుండా ఉండలేకపోయాను. నా జీవితంలో కొరతలు మీ కుత్తరం వ్రాయటంలో పోగొట్టుకొనేదాన్ని. మీరోసారి "లలితకి" ఫోటోలు కూడా పంపించారు జ్ఞాపకం వుందా శ్రీకాంత్, వాటిని ఎంత భద్రంగా దాచుకున్నానో తెలుసా?...ఎందుకులెండి. మా ఆయనకు నే రెండవ పెండ్లి. మా తండ్రిని, చదువుకొనీ కష్టపెట్టడం ఇష్టంలేక చేసుకున్నా, దానికి విచారించలేదు....మీరు క్షమించా ననరూ?" అని ప్రార్థించింది.

"మీకు తెలుసా మానసికంగా..."

చట్టున లేచి, రాబోయే మాటల్ని అడ్డుపెట్టడానికిగాను రజని తన చేయితో శ్రీకాంత్ నోరు మూసింది. "అన్నీ తెలుసు శ్రీకాంత్! కాని క్షమించా ననండి!" అని బ్రతిమాలింది రజని.

శ్రీకాంత్ పెదిమలకి రజని వెచ్చని హస్తం తగల్చడంతో నే ఉద్రేకస్థుడయ్యాడు. ఆమె భుజములని రెండూ పుచ్చుకొని తనవైపు లాక్కొని, గట్టిగా ముద్దు పెట్టుకుని విడిచాడు. వినీ వినబడకండా "క్షమించాను, ఇదే మన ప్రథమ అంతిమ సమావేశం" అని హాలులోనికి అడుగువేశాడు కారు హారన్ విని.

అంధకారాన్ని దూసుకుపోయే ముందులైట్లు ప్రశాంతపు ప్రకృతిని బెదిరించే బస్సు శబ్దం మెలికలు తిరిగిన రోడ్డు, కొండ చాటునుంచీ పోయినా వెంటాడి మీదనుంచీ పోయేలైట్లు, అన్నీ అవిఘాతంగా నడిచే, విధివ్రాతని జ్ఞాపకం చేస్తున్నాయి శ్రీకాంత్‌కు... ద్రాక్షాపాకపు శైలిలో చక్కని భావాలతో వ్రాసిన "రజని" ఉత్తరాలని నెమరు వేసుకుంటూ పట్టణం చేరాడా రాత్రి.

(మూలం : థామస్ హార్డీ)